క్లుప్తంగా

పెట్రోలింగ్ వాహనం నిలిపే ప్రదేశానికి సమీపంలోనే స్కూటీ



చీమకుర్తి: చీమకుర్తి పోలీసులు పెట్రోలింగ్‌కు ఉపయోగించే టాటా సుమో వాహనాన్ని ప్రతి రోజు మధ్యాహ్నం బైపాస్ సమీపంలోని దాబా వద్ద కర్నూల్‌రోడ్డు పక్కనే ఆర్‌అండ్‌బీ చెట్ల నీడన నిలబెట్టుకుంటుంటారు. అయితే టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు వినియోగించిన స్కూటీ చీమకుర్తి కర్నూల్ రోడ్డు పక్కనే నాలుగు రోజులుగా పార్కింగ్ చేసి ఉంది. అయినా దానిని ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం. పక్కనే ఉన్న దాబాతో పాటు ఎదురుగా టీ స్టాల్స్, టిఫిన్ కొట్లు, నిమ్మకాయ సోడా బండ్లు, కట్టెల అడితి అన్నీ రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. ఆయా దుకాణాల వద్ద ప్రతిరోజూ రాత్రి 9 గంటల వరకు జనాలు తిరుగుతుంటారు. ఒంగోలు–చీమకుర్తి మెయిన్‌రోడ్డు పక్కనే పార్కింగ్ చేసిన స్కూటీని నాలుగు రోజుల నుంచి ఎవరూ గుర్తించకపోవడంపై రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన డీఆర్‌ఓ

ఒంగోలు సబర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా గోదాములను సందర్శించారు. ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రత, వాటికి సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. గోదాము షట్టర్లకు వేసిన తాళాలు, వాటి సీలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న ఏపీఓ ధనుంజయవర్మ, సిబ్బంది

మద్దిపాడు: ఉపాధి హామీ పథకంలో మండలంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు స్వాతి చీమకుర్తికి, సోమేశ్వరరావు దర్శి క్లస్టర్‌కు, కంప్యూటర్ ఆపరేటర్ రామకృష్ణ జరుగుమల్లికి బదిలీ అయ్యారు. కాగా, ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ము లావణ్య కొత్తపట్నం నుంచి, టెక్నికల్ అసిస్టెంట్ హనుమాన్ ప్రసాద్ చీమకుర్తి నుంచి బదిలీపై మద్దిపాడు మండలం వచ్చారు. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న వారిని సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏపీఓ ధనుంజయవర్మ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఒంగోలులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు



ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ప్రతినిధులు

పహల్గామ్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

- పలు ప్రాంతాల్లో కొవ్వొత్తుల ప్రదర్శనలు
- మృతులకు ఘనంగా నివాళులు
- ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

ఒంగోలు టౌన్: పహల్గామ్‌లో పర్యాటకులను అత్యంత క్రూరంగా హత్యచేయడాన్ని నిరసిస్తూ పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ దారుణానికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. కొవ్వొత్తులు ప్రదర్శించి మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఒంగోలులో ఎల్బీజీ భవనం నుంచి రంగరాయుడు చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ కాశ్మీర్లో పోలీసులు, భద్రతా దళాలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయని, ఇలాంటి ఘోరమైన హత్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పర్యాటకులతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడం సమంజసం కాదన్నారు. అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్, జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింల జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన...

ఒంగోలు వన్‌టౌన్: పహల్గామ్‌లో పర్యాటకులపై తీవ్రవాదుల మారణకాండను ఖండిస్తూ ముస్లిం ప్రజాసంఘాలు, ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని పాత మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం అజాద్ విగ్రహం వద్ద ముస్లింలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీ సర్దార్ మాట్లాడుతూ భూతల స్వర్గం లాంటి కాశ్మీర్‌కు దేశ నలుమూలల నుంచి పర్యాటకులు వెళ్లి సేద తీరే క్రమంలో తీవ్రవాదులు కాల్పులతో విరుచుకుపడి నరమేధం సృష్టించారన్నారు. అమాయక పౌరులు మృతిచెందారన్నారు. తమ వారిని కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతమని అన్నారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపిన తీవ్రవాదులకు, ఇస్లాం సమాజానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ముస్లిం నాయకుడు పఠాన్ కరీముల్లాఖాన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇటువంటి సంఘటనకు కారకులైన వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. కేవలం హిందూముస్లింల మధ్య ద్వేషం పెంచడానికి, సోదర భావాన్ని దెబ్బతీయడానికి మతం ముసుగు కప్పుకుని చేసిన ఈ దారుణాన్ని భారతీయ ముస్లిం సమాజం ఖండిస్తోందన్నారు. మృతిచెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఎస్కే కరీముల్లా, ఎస్కే మహ్మద్‌రఫీ, ఎస్‌డీ ఇస్మాయిల్, ఎస్కే రఫీ ఎస్కే అబ్దుల్ రవూఫ్, ఎస్కే రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో కొవ్వొత్తులతో మృతులకు నివాళులు...

చీమకుర్తి: పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో అమరులైన వారికి జనసేన తరఫున కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి చీమకుర్తిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, పోకూరి రామకృష్ణారెడ్డి, తాతినేని శ్రీరామ్, వెంకట్రావు, సురేష్, యాసిన్ స్థానికులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కేవీ పాలెంలో...

చీమకుర్తి రూరల్: పహల్గామ్ ఘటనలో మృతిచెందిన టూరిస్టులకు సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని కేవీ పాలెం గ్రామంలో శుక్రవారం నివాళులర్పించారు. కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు పొత్తూరి సురేష్, జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, పూసపాటి వెంకటరావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, బెజవాడ శ్రీను, తొట్టెంపూడి రామారావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, దరిసి సుధాకర్, పమిడి నరసింహారావు, మాదాల నరసింహారావు, కొల్లూరి అక్కయ్య, రావూరి వెంకటరావు, వేమా కొండయ్య, పమిడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో పహల్గామ్ మృతులకు నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు



కేవీ పాలెంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

గమళ్లపాలెంలో చలివేంద్రం ప్రారంభం

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెంకటసాయిశెసి సఫ్లయిర్స్ సహకారంతో మండలంలోని గమళ్లపాలెం బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తుళ్లూరి వెంకటనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో బస్టాండ్ సెంటర్‌కు వచ్చే ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు తాతా గోపి, నాయకులు తాతా శ్రీను, టి.వెంకటేశ్వర్లు, దద్దాల శ్రీను, తుళ్లూరి బ్రహ్మయ్య, తుళ్లూరి ప్రవీణ్, టి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటనారాయణ

పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించాలి



పురస్కారాలు అందుకున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఒంగోలు టౌన్: పంచాయతీలను, స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక మల్లయ్య లింగం భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పరిపాలన కేంద్రీకరణకు నమూనాలుగా ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు స్వయం పాలన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్న పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు ఉత్తమ స్థానిక నాయకత్వ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి సంఘ జిల్లా నాయకులు ఆకుపాటి వెంకటేష్, పలు మండలాల ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయో పరిమితి పెంచాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయో పరిమితిని 60 సంవత్సరాలకు పెంచాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.సుజన్ మాదిగ కోరారు. ఆ మేరకు శుక్రవారం తాడేపల్లిలో మాదిగ కార్పొరేషన చైర్మన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందించారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ఆటో అందజేత



వెంకటరెడ్డికి ఆటో అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: యర్రగొండపాలెం మండలానికి చెందిన దివ్యాంగుడైన వెన్న వెంకటరెడ్డికి జీవనాధారం కోసం బ్యాటరీ ఆటోను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శుక్రవారం స్థానిక ప్రకాశం భవన్‌లో అందజేశారు. గనులు, దివ్యాంగుల శాఖ సమన్వయంతో ఆటో కొనుగోలు చేసి లబ్ధిదారుడికి అందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జి.అర్చన, ముఖ్య ప్రణాళిక అధికారి, సమాచార సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సంతనూతలపాడు ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు గ్రామ పంచాయతీ మన్నంవారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో డి.సురేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. నీటి కుంట పూడికతీత పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేశారు. పనులు చేస్తున్న కూలీలకు వేసవి నేపథ్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ఏపీఓ వాసంతి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

సముద్ర పచ్చళ్ల షాపులు ప్రారంభం

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల, మదనూరు గ్రామాల్లో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఎల్‌ఈడీపీ ప్రోగ్రాం ద్వారా ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీ సముద్ర పచ్చళ్ల షాపులను నాబార్డ్ డీజీఎం ఎంఎం బెహెర, రీజినల్ ఆఫీస్ ఆంధ్రప్రదేశ్ డీడీఎం జె.రవికుమార్, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎల్‌డీఎం రమేష్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బెహెర మాట్లాడుతూ మత్స్యసంపద అయిన చేపలు, రొయ్యలు, పీతలతో రకరకాల పచ్చళ్లు తయారు చేసి అమ్ముకోవడానికి డ్వాక్రా మహిళా సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన మహిళలు మండలంలో రెండు షాపులను నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేయగా, ప్రారంభించామన్నారు. ఒంగోలులోని హెచ్‌సీఎం కాలేజీ ఎదురుగా కూడా మరో షాపును ప్రారంభించామన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రేరణ ఎన్‌జీవో నాగలక్ష్మి, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న బెహెర, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, రమేష్

ఆదరణ–3లో నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలి

ఒంగోలు వన్‌టౌన్: ఆదరణ–3లో నాయీబ్రాహ్మణులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని నాయీబ్రాహ్మణ అభివృద్ధి, సమాచార వేదిక నాయకుడు కడవకుదురు అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ హయాంలో ఆదరణ 1, 2 కార్యక్రమాలలో అప్పటి ఈడీ కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనిముట్లను లబ్దిదారులకు అందించారన్నారు. డీడీలుగా కట్టించుకున్న రూ.3000 కూడా రుణాలు మంజూరుగాని వారికి ఇంతవరకూ తిరిగి ఇవ్వలేదన్నారు. ఆదరణ కార్యక్రమంలో 80 శాతానికిపైగా అధికారులు దోపిడీ చేశారన్నారు. గతంలో ఉన్న నాయీబ్రాహ్మణ నాయకులే ప్రస్తుతం కూడా బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారన్నారు. అర్హులైన వారికి రుణాలు అందకుండా, వారికి ఇష్టమైన వారికే రుణాలు మంజూరు చేయించుకునేందుకు అధికారులకు సిఫార్సులు చేస్తున్నారన్నారు. గతంలో నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన కుర్చీలు ఎందుకూ పనికిరాలేదన్నారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కడవకుదురు అంజిబాబు, ఏల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి

- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

ఒంగోలు వన్‌టౌన్: సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తూ ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాలలో 500 మార్కులకుపైగా, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకుపైగా సాధించిన విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ వసతి గృహ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ సహాయ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో శుక్రవారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉన్నత విద్యకు ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వసతి గృహ సంక్షేమ అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది వారి పరిధిలోని గ్రామాలను సందర్శించి వసతి గృహాలలో సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు వసతి గృహాలలో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహాల నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ లక్ష్మానాయక్

వెంకటభార్గవికి ఏకేవీకే కళాశాల కరస్పాండెంట్ అభినందనలు



వెంకటభార్గవికి అభినందనలు తెలుపుతున్న కరస్పాండెంట్ చెంచురామయ్య, తదితరులు

ఒంగోలు సిటీ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన పుట్టా వెంకట భార్గవిని స్థానిక ఏకేవీకే కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పల్లపు చెంచురామయ్య, ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, ఏఓ వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం సన్మానించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చెంచురామయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడేతత్వం అలవరచుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఏ రంగంలోనైనా పట్టుదలతో కష్టపడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యనభ్యసించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన వెంకటభార్గవిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాకా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనీల్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

సంతనూతలపాడు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పమిడి హరిణి పాల్గొని దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ హరిణి కోరారు. దోమకాటు పెనుముప్పని, ప్రతిఒక్కరూ దోమతెరలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ట్యాంకులు, నీటి తొట్లను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.ప్రసాద్, వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, వీరమ్మ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక జ్వరాల నివారణపై అవగాహన కల్పించాలి...

మద్దిపాడు: దోమల వలన వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి ప్రాణాంతకమైన జ్వరాల నివారణపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆనందమోహన్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శుక్రవారం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఆనందమోహన్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నివారించడం ఎంత ముఖ్యమో.. దోమ కాటు వలన వచ్చే ప్రాణాంతక జ్వరాల నుంచి కూడా ప్రజలను రక్షించడం అంతే ముఖ్యమని అన్నారు. గృహాల సందర్శన సమయంలో దోమల లార్వాలను నాశనం చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బండ్లమూడిలో ర్యాలీ...

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కమల, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ అప్సర్, మాదవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా రహిత గ్రామాలను తీర్చిదిద్దాలి...

కొత్తపట్నం: మలేరియా రహిత గ్రామాలను తీర్చిదిద్దాలని కొత్తపట్నం పీహెచ్‌సీ డాక్టర్ రమ్య దీపిక పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తపట్నంలోని పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నినాదాలు చేసుకుంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లతో డాక్టర్ రమ్య దీపిక ప్రతిజ్ఞ చేయించారు. మలేరియా వ్యాధిపై గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభాకర్, జి.సులోచనరాణి, తదితరులు పాల్గొన్నారు.



మద్దిపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ ఆనందమోహన్, వైద్య సిబ్బంది



కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రమ్య దీపిక, సిబ్బంది